జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 4 | మార్చి | 2025 ◆ పేజీలు : 5


## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి..

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మేస్త్రీలదే కీలక పాత్ర..**

**ఇందిరమ్మ ఇండ్ల మేస్త్రీలకు శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 3, ప్రజాజ్యోతి :*

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఇండ్ల నిర్మాణంలో మేస్త్రీలదే కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ ( న్యాక్ ) వారి ఆధ్వర్యంలో

మిగతా 2 లో...



2 లో..

## చికెన్ తినాలా..? వద్దా..?

**చికెన్ ప్రియుల డైలమా తగ్గిన చికెన్ కొనుగోళ్లు**

**పెరిగిన మటన్, చేపల విక్రయాలు**

**కోళ్లకు తగ్గుముఖంపట్టిన వైరస్ లక్షణాలు**

ఉమ్మడి జిల్లాలో బర్డ్ ఫ్లూ లక్షణాలు తగ్గినా చికెన్ తినా లా? వద్దా? అనే డైలమాలో చికెన్ ప్రియులు ఉన్నారు. ఈ నేపథ్యంలో చికెన్ విక్రయాలు తగ్గగా మాంసం ప్రియులు ప్రత్యామ్నాయంగా చేపలు, మటన్ కొనుగోలు చేస్తు న్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో చేపలు, మటన్ విక్రయాలు పెరిగాయి. అయితే వీటికి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు అమాంతం ధరలు పెంచి విక్రయిస్తున్నారు.

◆ భద్రాచలం, ప్రజాజ్యోతి



## సీతారామప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం

**గోదావరి, కృష్ణ జలాల అనుసంధానం**

**సీతారామ పంప్ హౌస్ సందర్శించిన మంత్రి తుమ్మల**

*ములకలపల్లి, మార్చి 3, ప్రజాజ్యోతి:*

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగర్ కాలువ లోకి గోదావరి జలాలను కలపడంతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలసి, సోమవారం మండలంలో ఉన్న పూసుగూడెం సీతారామ పంప్ హౌస్, కమలాపురం హెడ్ రెగ్యులేటర్ సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గోదావరి జలాలను కృష్ణ జలతో కలపడం బృహత్తర కార్యక్రమం అన్నారు. రూ.8 వేల కోట్ల వ్యయంలో గత ప్రభుత్వ హయాంలో మూడు పంపు హౌస్ లతో పాటు 100 కిలో మీటర్ల పొడవు కాలువ నిర్మాణ పనులు పూర్తి చేసుకొని లక్ష ఎకరాలకు సాగునీరు

మిగతా 2 లో...

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి..

**ప్రభుత్వాసుపత్రిలో డెలివరీల సంఖ్య పెంచాలి..**

**వైద్యులు సమయపాలన పాటించాలి..**

**ఆసుపత్రులలో మందులు లేవంటే ఫార్మసిస్ట్ లదే భాద్యత..**

**జిల్లాస్థాయి ఆసుపత్రుల ప్రగతి పై సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 3, ప్రజాజ్యోతి :*

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా వైద్య విధాన పరిషత్ శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన జిల్లాలోని ఆసుపత్రుల

మిగతా 2 లో...

## విస్తరణకు నాంది

**విస్తరణకు నాంది**

**సింగరేణి - ఆర్ వీ యూ ఎన్ ఎల్ ఆధ్వర్యంలో 3100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు**

**1500 మెగావాట్ల సోలార్, 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ల ఏర్పాటు**

**రాజస్థాన్ విద్యుత్ సంస్థ తో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసేందుకు చరిత్రాత్మక ఒప్పందం**

**రాష్ట్ర ప్రభుత్వం చొరవతో జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు**

**రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**

**సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు**

**చరిత్రాత్మక ఒప్పందం, సింగరేణి విస్తరణలో గొప్ప ముందడుగు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**పరస్పర సహకారంతో మరిన్ని ప్రాజెక్టులు : రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ**

**వ్యయం, లాభాల్లో 74 శాతం సింగరేణి, 26% రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ కు వాటా**

**ఇతర రాష్ట్రాల్లో భారీ ప్రాజెక్టు తో జాతీయ స్థాయి కంపెనీగా సింగరేణికి గుర్తింపు**



*కొత్తగూడెం సింగరేణి, మార్చి 3, ప్రజాజ్యోతి*

136 ఏళ్ల సింగరేణి చరిత్రలో మరో గొప్ప వ్యాపార విస్తరణకు నాంది పడింది. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో తొలిసారిగా ఇతర రాష్ట్రంలోని విద్యుత్ సంస్థతో కలిసి సంయుక్తంగా 3100 మెగావాట్ల సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందడుగు వేసింది. సోమవారం రాజస్థాన్ లోని జైపూర్ లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, తెలంగాణ ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాజస్థాన్

మిగతా 2 లో...

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి..

(మొదటి పేజీ తరువాయి...)

సోమవారం ప్రగతి మైదానంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల మేస్త్రీల శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఇళ్ల నిర్మాణంలో నాణ్యత, గట్టితనం ఉండేలా, వ్యయాన్ని తగ్గించేలా, ఇంటి నిర్మాణ సామగ్రి వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలపై మేస్త్రీలకు శిక్షణ ఇస్తున్నారని అన్నారు. పేదలకు తక్కువ ఖర్చుతో పటిష్ఠంగా, పూర్తి భద్రతతో ఇండ్లు ఎలా నిర్మించాలని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటిని 400 చదరపు అడుగుల లోపు నిర్మించాలని సూచించారు. ప్రభుత్వం అందజేసే రూ.5లక్షలతో క్వాలిటీతో ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ ఇందిరమ్మ ఇండ్ల పథకం లో భాగంగా నాలుగు దశల్లో నిధులు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మొదటి విడతగా బేస్మెంట్ పూర్తి అయిన తర్వాత లక్ష రూపాయలు, రెండవ విడతగా గోడల నిర్మాణం పూర్తి అయిన తర్వాత లక్ష 25 వేల రూపాయలు, మూడవ విడత స్లాబ్ పూర్తయిన తర్వాత లక్ష 75 వేల రూపాయలు, నాల్గవ విడతగా ఇంటి నిర్మాణం పూర్తి అయిన తరువాత లక్ష రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పేదలకు నిర్మించే ఇండ్లను నాణ్యంగా, దృఢంగా నిర్మించాలన్నారు. ఆరు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మేస్త్రీలకు టీ షర్ట్ లు, హెల్మెట్, బ్యాగు పంపిణీ చేశారు. శిక్షణ కార్యక్రమంలో 30 మంది మేస్త్రీల కు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి శంకర్, మెప్మా పి డి రాజేష్, న్యాక్ అధికారిని హెప్సిబా , ఇన్స్పెక్టర్ కరుణాకర్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి..



(మొదటి పేజీ తరువాయి...)

ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రిల లో ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్, స్కానింగ్, రక్త పరీక్షలు, సర్జరీలు డయాలసిస్, డెలివరీలపై ఆస్పత్రులు వారీగా ప్రగతిపై ఆసుపత్రుల సూపర్డెంట్ లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ఆసుపత్రులలో పారిశుధ్యం కొరకు అధునాతన యంత్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని ఆసుపత్రులలో ఈ ఎన్ టీ వైద్యం కోసం కావలసిన యంత్ర పరికరాలకు సంబంధించి నివేదికలు అందించాలన్నారు. గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ఆసుపత్రుల్లో ఎక్కడైనా లీకేజీ, త్రాగునీటి సమస్య వంటి వాటిని గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామకానికి తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రిలో అభివృద్ధి కొరకు సింగరేణి, ఐ టి సి, కేటీపీఎస్ నవ భారత్ వంటి పరిశ్రమలు ముందుకొస్తున్నాయని, దానికి తగిన విధంగా సరైన ప్రణాళికలు రూపొందించాలని సూపర్డెంట్ లను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. సిబ్బంది హాజరు పై ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. నర్సింగ్ సూపర్డెంట్లు ప్రజల అవసరాలకు తగ్గట్టుగా సిబ్బందికి డ్యూటీలు వేయాలని అన్నారు. ఆసుపత్రులలో సరిపడా మందులు లేవంటే ఆసుపత్రి ఫార్మసిస్టులు దే బాధ్యత అని అన్నారు. అవసరమైన మందులకు ఎప్పటికప్పుడు ఇండెంట్లు పంపించాలని సూచించారు. ఇండెంట్లు పెట్టిన మందులు రాకపోతే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచి డెలివరీ ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరిగేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చే పేద రోగుల కు అందించే వైద్య సేవలలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అన్ని విభాగలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఓ రవి బాబు, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల సూపడెంట్లు , సిబ్బంది పాల్గొన్నారు.

# చికెన్ తినాలా? వద్దా?



**భద్రాచలం ,మార్చి 3,(ప్రజాజ్యోతి ):**

రాష్ట్రంతోపాటు సరిహద్దు ఏపీ రాష్ట్రంలోని పలు జిల్లాలో కోళ్లు అకస్మాత్తుగా మృత్యువాత పడటంతో ఉమ్మడి జిల్లాలో సైతం బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. ఖమ్మం జిల్లాలో కోళ్లు మృతిచెందడంతో ఆ ప్రభావం భద్రాద్రి జిల్లాపై కూడా కనిపించింది. ఉమ్మడి జిల్లాలో కోళ్లు మృతిచెందినా, అవి ఏ కారణాలతో అనేది తొలుత అంతుచిక్కలేదు. ఆ తరువాత సత్తుపల్లి మండలంలో బర్డ్గా కేసు నమోదైంది. పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండకపోవడం, కోళ్లు మృతి చెందినా, ఆ విషయాన్ని పశుసంవర్ధకశాఖ అధికారులు, వైద్యుల దృష్టికి తీసుకెళ్లకపోవడంతో ఈ పరిస్థితులు తలెత్తాయి. సంబంధిత కోళ్ల ఫారమ్ యజమానులు, పౌల్ట్రీ రైతులు కోళ్ల ఆరోగ్యాన్ని అంచనా వేయలేకపోయారని, విషయాన్ని తమ దృష్టికి ఆలస్యంగా తీసుకువచ్చారని అధికారులు పేర్కొంటున్నారు.దీనికి తోడు గత నెలా మూడో వారం వరకు కూడా అంటే శివరాత్రి వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి చల్లటి గాలులు వీయడం కూడా కోళ్ల మరణానికి కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో కొంత మేర వైరస్ లక్షణాలు తగ్గుముఖం పట్టినట్టు సమాచారం. మార్చిలో ఎండలు 35 నుంచి 40డిగ్రీలవరకు ఏప్రిల్, మేలో 45 డిగ్రీల కుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నా యి. ఉష్ణోగ్రతలు పెరగడంతో బర్డ్ ఫ్లూ వైరస్ లక్ష ణాలు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయి.

### చికెన్ ప్రియుల సందేహాలు

బర్డ్ ఫ్లూ కలకలంతో చికెన్ ప్రియులు డైల మాలో ఉన్నారు. చికెన్ తింటే జబ్బులు వస్తాయనే విషయం వారిని వెంటాడు తోంది. అయితే చికెన్ బాగా ఉడికించి తింటే ఎలాంటి ప్రమాదం లేదని పశు వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి చికెన్ కొనుగోళ్లపై ప్రభావం పడటంతో కోళ్లఫామ్ యజమానులు కొంత మేర నష్టపోయారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ ప్రియులు ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. బర్డ్ ఫ్లూ లక్షణాలు ఏ విధంగా ఉంటాయనే దానిపై కాస్తా గందరగోళంలో ఉన్నారు. కొన్ని కంపెనీలు పలు ప్రాంతాల్లో చికెన్ మేళాలు ఏర్పాటుచేసి ఉచితంగా పంపిణీ చేశాయి. చికెన్ తినడం వల్ల ఎలాంటి ప్రమాదం లేదని కంపెనీలు ప్రజలను చైతన్యం చేసే పనిలో ఉన్నాయి.

### మటన్, చేపల కోసం ఎగబడుతున్న జనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మటన్, చేపల కొనుగోళ్లు పెరిగాయి. చికెన్ తింటే ఏమవుతుందోననే భయంతో ప్రజలు చేపలు, మట న్ కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారు. కొద్ది రోజల క్రితం వరకు బొచ్చ చేప కిలో రూ.180 ఉండగా, ప్రస్తుతం రూ.240కిలో చొప్పున విక్రయిస్తున్నారు. మటన్ కొద్ది రోజుల క్రితం వరకు కిలో రూ.800 ఉండగా ప్రస్తుతం రూ.900 నుంచి రూ.1000కి పెరిగింది. చికెన్ ధరలు స్కిన్ తో కిలో రూ.170 ఉండగా, స్కిన్లెస్ రూ.194 వరకు విక్రయిస్తున్నారు. బర్డ్ ఫ్లూ సమస్య ఉన్నా, చికెన్ ధరల్లో మాత్రం వ్యత్యాసం కొద్దిగానే ఉంది. విక్రయాలపై మాత్రం బర్డ్ ఫ్లూ ప్రభావం ఉంది. ఇదిలా ఉంటే ఆదివారం రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈనెల రోజులు చికెన్ హాలీమ్ తో పాటు మటన్ హాలీమ్ ను ఎక్కువగా తింటుంటారు. అయితే బర్డ్ ఫ్లూ సమస్య ఉండటంతో చికెన్ హాలీమ్ విక్రయాలపై ప్రభావం ఉంటుందా? అని తయారీదారులు ఆందోళనలో ఉన్నారు. ప్రస్తుతం చికెన్ హాలీమ్ ధర రూ.140 నుంచి రూ.150 ఉండగా, మటన్ హాలీమ్ రూ.200 నుంచి రూ.250వరకు ఉంది.

## సీతారామప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం

(మొదటి పేజీ తరువాయి...)

అందించేందుకు సిద్దంగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పనులు చక చక సాగుతున్నాయ న్నారు. సీతమ్మ సాగర్ నిర్మాణానికి కేంద్రం అనుమతులు ఇవ్వాలన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే 300 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి తోపాటు ఉమ్మడి జిల్లా లో రైతుల భూములకు నీరందించందుకు వీలవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం పై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని నీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్య దోరణి తో ఉందన్నారు. జాతీయ రహదారులకు నిధులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం, పాండు రంగాపురం నుంచి భద్రాచలానికి రైల్వే లైన్ విషయంలో సహకరించలేదన్నారు. కొత్తగూడెం విమానాశ్రయం విషయం లో స్పందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ రావు, పర్వతనేని అమర్ నాథ్, బాల అప్పారావు, బత్తుల అంజి, అడపా నాగేశ్వరరావు, కరుటూరి కృష్ణ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు గుంపుల రవితేజ, పువ్వుల మంగపతి, సురభి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# విస్తరణకు నాంది

(మొదటి పేజీ తరువాయి...)

ఇంధన శాఖ మంత్రి హీరాలాల్ నగర్ సమక్షంలో సింగరేణి, రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ అధికారులు ఈ మేరకు కీలక ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం ఒక చరిత్రాత్మక ఘట్టమని, త్వరలోనే ఇది కార్యాచరణలోకి వస్తోందని, సింగరేణి వ్యాపార విస్తరణ, సుస్థిర భవిష్యత్ కోసం ఇది ఎంతగానో దోహదం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కమల్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అపార బొగ్గు నిల్వలతో థర్మల్ విద్యుత్కు నిలయంగా.. రాజస్థాన్ రాష్ట్రం సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా దేశంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయన్నారు. పురోగతి పంథాలో సాగుతున్న ఈ రెండు రాష్ట్రాలు తమ భౌగోళిక పరిస్థితులను అవకాశాలుగా మలచుకోవడానికి పరస్పర సహకారంతో ముందుకు రావడంతో దేశ ఇంధన రంగంలో విప్లవాత్మకమైన మార్పునకు శ్రీకారం చుట్టినట్లు అయిందన్నారు.తెలంగాణ – రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందన్నారు. ఇరు సంస్థలు జాయింట్ వెంచర్ కంపెనీగా ఏర్పడి 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ను, 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేయనున్నాయని, పెరుగుతున్న దేశ విద్యుత్ అవసరాలకు ఈ ఒప్పందం ఎంతో దోహదపడనున్నదని పేర్కొన్నారు. ముఖ్యంగా వినియోగదారులకు చవకైనా విద్యుత్ను అందించగలమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజస్థాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ మాట్లాడుతూ ఇప్పటివరకు తమ రాష్ట్ర విద్యుత్తు శాఖ కోల్ ఇండియా అనుబంధ సంస్థలతో మాత్రమే ఇటువంటి ఒప్పందాలు చేసుకొందని, ఇప్పుడు దక్షిణాదిలో ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగానే కాక థర్మల్, సోలార్ విద్యుత్ రంగాలలో అనుభవం ఉన్న సింగరేణితో ఒప్పందం కుదరడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. సింగరేణికి గల అనుభవం రీత్యా ఒప్పందంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులతో పాటు రానున్న కాలంలో మరిన్ని కొత్త ప్రాజెక్టులు కూడా సింగరేణితో కలిసి పని చేయడానికి తమ రాష్ట్ర విద్యుత్ శాఖ సానుకూలంగా ఉందన్నారు.

### ఒప్పంద వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

ఈ ఒప్పందం ప్రకారం 1,600 మెగావాట్ల (2x800మె.వా) థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో పాటు 1,500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. మొత్తం పెట్టుబడిలో సింగరేణి సంస్థ 74 శాతం వాటాను, రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ 26 శాతం వాటాను చెల్లించనున్నాయి. రాజస్థాన్ ప్రభుత్వం తన వాటా కింద చెల్లించాల్సిన 26 శాతం ధనాన్ని సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన స్థలాలు, మౌలిక సదుపాయాల రూపంలో కాగా, సింగరేణి తన వాటాగా అంగీకరించిన 74 శాతాన్ని ధన రూపంలో చెల్లించనుంది. ప్లాంట్ల ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని అన్ని రకాల అనుమతులతో సింగరేణికి ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్పగించనున్నది. ఈ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తు కొనుగోలుకు సంబంధించి డిస్కములతో ఒప్పందాలు (పీపీఏ) తదితర అంశాలను రాజస్థాన్ ప్రభుత్వ విద్యుత్ శాఖ వారు చేపట్టనున్నారు. పరస్పర అవగాహనతో లాభదాయకంగా ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తారు.

### ఒక్కసారిగా మారిపోనున్న సింగరేణి ముఖచిత్రం

సింగరేణి సంస్థ ఇప్పటివరకు కేవలం తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితమై తన బొగ్గు ఉత్పత్తి, థర్మల్, సోలార్ రంగాలలో అడుగు పెట్టి విద్యుత్ ను ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఏర్పాటు చేయగా అదే ప్రదేశంలో మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. అలాగే ప్రస్తుతం 245.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థ 2026 నాటికి 450 మెగావాట్లకు పైగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి బొగ్గు సంస్థల్లో నెట్ జీరో కంపెనీగా నిలవాలని ప్రణాళికా బద్ధంగా ముందుకుపోతుంది. వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా ఒడిశా రాష్ట్రంలోని నైనీ వద్ద ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే ప్రాజెక్టును చేపట్టింది. ఇది మరో 30 రోజుల్లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించనుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఇదే ప్రాంతంలో 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించి ఆ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగిస్తుంది. ఇదిలా ఉండగా ఈరోజు రాజస్థాన్ ప్రభుత్వంతో చేసుకుంటున్న 3,100 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదక ప్రాజెక్టుల ఒప్పందం ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలవనుంది. రాష్ట్ర ప్రభుత్వం అంగీకారంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కమల్లు ప్రత్యేక చొరవతో, సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ ఈ ఒప్పందం కోసం గత ఏడాదికాలంగా ప్రత్యేక కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆయన రాజస్థాన్ రాష్ట్రాన్ని సందర్శించి సోలార్ ప్లాంట్లకు అనువైన ప్రదేశాలను అన్వేషించి రావడం జరిగింది. సింగరేణి సంస్థకు పటిష్టమైన ఆర్థిక పునాది ,భవిష్యత్తును కల్పించడం కోసం ఈ ఒప్పందం కీలకంగా మారనుంది. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ రాష్ట్ర ఇంధన శాఖ అడిషన్ చీఫ్ సెక్రటరీ అలోక్, తెలంగాణ రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

# పోలీసులకు ధీటుగా ఎక్సైజ్ శాఖ పని చేయాలి

**పురోగతిపై సంతృప్తి..**

**ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్ రెడ్డి అదేశాలు**

*భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి 03, ప్రజాజ్యోతి :*



ఎక్సైజ్ అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు పోలీసులకు ధీటుగా పని చేసి డిపార్టుమెంట్ కు మంచి పేరు తీసుక రావాలని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వి బి . కమలాసన్ రెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మం, కొత్తగూడెం, పెద్దపల్లి, కాగజ్ నగర్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన 86 మందికి ఎక్సైజ్ అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు డైరెక్టర్ వి.బి.కమలాసన్ రెడ్డి చేతుల మీదుగా క్యాష్ అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం ఎక్సైజ్ శాఖ (అబ్కారీ భవన్) సమావేశ మందిరంలో జరిగింది. తెలంగాణలో ఎక్సైజ్ శాఖ పట్టుకుంటున్న గంజాయిలో 90 శాతం గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం జి ల్లాలో పట్టుకోవడం అనందంగా ఉందన్నారు. ఏఓబీ నుంచి వస్తున్న గంజాయిని పట్టుకోవడంతో పాటు ఇతర మార్గాల్లో కూడ గంజాయి తరలివెలుతున్న మార్గాలను కనిపెట్టాలన్నారు. ఏపీ, ఒరిస్సాల్లో పండుతున్న గంజాయి దేశంలోని అన్ని ప్రాంతాలకు వెలుతుందని అన్నారు. నేరస్థులకు శిక్షలు పడినపుడు నిందితులకు నేరం చేయాలంటే భయం వేస్తుందని అన్నారు. గంజాయిని పట్టుకున్నప్పు డు పంచనామా నుంచి కేసు ట్రయల్ , శిక్షణలు పడేవిధాంగా చార్జీషీట్స్ రాయాలని సూచించారు. ప్రస్తుతం ఎక్సైజ్ శాఖ పని తీరు బాగుందని, మరింతగా కృషి చేసి ప్రభుత్వం అదేశించిన రీతిలో గంజాయి, డ్రగ్స్ ను లేకుండా చేయడానికి ప్రయత్నాలు చేయాలన్నారు. ఖమ్మం, కొత్తగూడెంలో 72 మందికి, పెద్దపల్లి, సుల్తానాబాద్ నుంచి 8 మందికి, కాగజ్ నగర్, నిర్మల్ నుంచి 3 ముగ్గురికి,అపరేషన్ ధూల్ పేట్ లో భాగంగా ఎక్సైజ్ సూపరిండెంట్ నంద్యాల అంజి రెడ్డి, సీఐలు మదుబాబు, గోపాల్ నగదు రివార్డులను అందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తోపాటు జాయింట్ కమిషనర్ ఖురేషి, కరీంనగర్, ఖమ్మం డిప్యూటి కమిషనర్లు డేవిడ్ రవికాంత్, జనార్ధన్ రెడ్డి అసిస్టేంట్ కమిషనర్లు ప్రణవీ, గణేష్ లతోపాటు ఎక్సైజ్ సూపరిండెట్లు నంద్యాల అంజి రెడ్డి, పెద్దపల్లి, నిర్మల్ మహిపాల్, రజాక్, ఏఈఎస్ లు తిరుపతి,కరమ్ చంద్ పాల్గొన్నారు. ఏ సి గణేష్,సీఐ రహిమ్ ఉన్నిషా బేగం, హెడ్ కానిస్టేబుల్ రహిమ్ లను డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## అర్హులైన దళితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

**– ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్ పెంచాలి**

**– జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి**

*కొత్తగూడెం, మార్చి 3, ప్రజాజ్యోతి :*



ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయడంతో పాటు, కొత్త రుణాల కోసం షెడ్యూలు విడుదల చేయాలని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో చుంచుపల్లి, నెహ్రు బస్తీ, బర్మా క్యాంప్, బాబు క్యాంప్, రామవరం, విద్యానగర్ కాలనీ లో సోమవారం విస్తృతంగా పర్యటించి పలువురు ప్రముఖులను కలుసుకొని సంఘం బలోపేతం పై చర్చించారు.ఈ సందర్భంగా కొత్తగూడెంలో నియోజకవర్గ అధ్యక్షులు గుడివాడ రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, జాతీయ కార్యదర్శి, జిల్లా ఇన్ ఛార్జ్ అసోద భాస్కర్ ఆదేశాల మేరకు జిల్లాలో జాతీయ మాల మహానాడు ను బలోపేతం చేయడంతో పాటు, సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో దళితులు ఐక్యతగా ఉండి పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల తరహా 20 శాతం రిజర్వేషన్లు పెంచుకునేలా కృషి చేయాలని కోరారు. అలాగే జిల్లాలో అర్హులైన దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు మంజూరు చేయడంతో పాటు కొత్త రుణాలు మంజూరు చేయడం కోసం షెడ్యూలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం దళిత బంధు అమలు చేస్తున్నామని చెప్పి కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పేరుతో అర్హులైన దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, కానీ నేటి వరకు అమలు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటితో పాటుగా అర్హులైన దళిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు సీనియర్ నాయకులు జెట్టి మోహన్, రాజాని దేవయ్య, మాజీ ఎంపీటీసీ కేడెం రాము, జెంజర్ల కృష్ణ( జె కె ), పండుగ రాజేశ్వరరావు, మెల్లం పురుషోత్తం, బట్టు శ్రీనివాసరావు, తాటూరి ఈశ్వరయ్య, చుంచుపల్లి మండల అధ్యక్షులు తోకల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## 3100 మెగావాట్ల విద్యుత్ ఒప్పందం సింగరేణికి లాభాదాయకం

**ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ కార్యదర్శి యండి. ఖాజా గౌస్ మోహినుద్దీన్**

*ఇల్లందు, మార్చి 3, ప్రజాజ్యోతి:*



సింగరేణి – రాజస్థాన్ ప్రభుత్వం మధ్య 3100 మెగావాట్ల విద్యుత్ ఒప్పందం సింగరేణికి ఎంతో లాభాదాయకమని ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ కార్యదర్శి, ఆల్ ఇండియా అసంఘటీత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) రాష్ట్ర ఉపాధ్యక్షుడు యండి. ఖాజా గౌస్ మోహినుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ ల మధ్య అవగాహనా ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం సింగరేణి సంస్థ 1600 మెగావాట్ల ధర్మల్ విద్యుత్, 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయనుందని, ఇందులో సింగరేణి 74 శాతం, రాజస్థాన్ ప్రభుత్వం 26 శాతం ఉంటుందని తెలిపారు. ఈ ఒప్పందం చేయడం పట్ల రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ హర్షం వ్యక్తం చేసినట్టు పేర్కొన్నారు.

## గిరిజనులు ఇచ్చే ఆర్జీలను వెంటనే పరిష్కరించాలి

**భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్**

*భద్రాచలం, మార్చి 3(ప్రజాజ్యోతి ):*

మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులు అందజేసే వినతిపత్రాల్లోని సమస్యలను సకాలంలో పరిష్కరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్లో పీవో రాహుల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పీవో రాహుల్ మాట్లాడుతూ ఎక్కువ శాతం దరఖాస్తులు పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ట్రైకార్ ద్వారా అందించే సబ్సిడీ రుణాల కోసం కొత్తగా ఏర్పాటు చేసే మత్సకార సొసైటీల అనుమతి కోసం కరెంటు, బోరు మోటారు ఇప్పించాలని ఆర్జీలు పెట్టుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ దేవిద్రరాజు, డీడీ మణెమ్మ, ఎస్డీసీ రవీంద్రనాథ్, ఏవో సున్నం రాంబాబు, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, ఈఈ చంద్రశేఖరన్ పాల్గొన్నారు.



## గంజాయి పట్టివేత

*టేకులపల్లి,మార్చి03, ప్రజాజ్యోతి :*

మండలంలోని వెంకట్యా తండ వద్ద పోలీసుల తనిఖీల్లో గంజాయిను పట్టుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు టేకులపల్లి పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా బజాజ్ పల్సర్ బైక్ పై వస్తున్న వారు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించగా అనుమానం వచ్చి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద ఎనిమిది వందల గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఎండు గంజాయిని ద్విచక్ర వాహనాన్ని , ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా సీలేరు నుండి హైదరాబాద్ తరలించి అక్కడ అధిక రేట్లకు అమ్ముతున్నామని వారు తెలిపారు. ఇట్టి అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ కు రెండు రోజుల పాటు అవగాహనా సదస్సు



*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 03, ప్రజాజ్యోతి :*

డిఆర్డీఓ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్ లు కుట్టుటకు గాను కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ కు రెండు రోజుల జిల్లా స్థాయి అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సు లో డిఈఓ, పిడి అర్బన్,డిపిఎం (ఎన్ఎఫ్), ఎపిఎం (ఎన్ ఎఫ్), & జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ హాజరయ్యారు. కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ కు "బల్క్ కటింగ్, స్టిచింగ్, క్లోత్ లో రకములు, క్లోత్ పన్నాలు, కొలతలు తీసుకునే విధానం, కాజా ,గుండీ లు కుట్టే మెషిన్స్ పై శిక్షణ ఇవ్వటం జరిగిందని తెలిపారు.ఈ అవగాహన సదస్సులో మొదటి రోజు జిల్లా రిసోర్స్ టీం 6 గురు టిఓటి సభ్యులు, హబ్ మోడల్ – మండల స్థాయి రిసోర్స్ పర్సన్స్ –132, స్పోక్ మోడల్ : గ్రామ స్థాయి రిసోర్స్ టీం, ప్రతీ గ్రామం నుండి 10 మంది చొప్పున పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేత మూడు వెంకటేశ్వర్లు మృతి



*టేకులపల్లి, మార్చి03, ప్రజాజ్యోతి :*



టీడీపీ సీనియర్ నాయకులు టేకులపల్లి మాజీ ఎంపీటీసీ మూడు వెంకటేశ్వర్లు (58)అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతిచెందారు. మండలంలోని మూడు తండా తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య మూడు వెంకటేశ్వర్లు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఇల్లందు నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ మూడు వెంకటేశ్వర్ల మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి మండల అధ్యక్షులు పార్టీ నాయకులు గుడిపూడి మోహన్ రావు టిడిపి పార్టీ కండువా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రీడలలో గెలుపోటములు సహజమే



*ఇల్లందు, మార్చి 3, ప్రజాజ్యోతి:*

క్రీడలలో గెలుపోటములు సహజమేనని, గెలిచినవారు గర్వపడకుండా, ఓడిన వారు నిరుత్సాహపడవద్దని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. సోమవారం పరశురామ్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక జెకె కాలనీ సిఈఆర్ క్లబ్ గ్రౌండ్ లో నిర్వహించిన కెకె ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కోరం కనకయ్య టాస్ వేసి మ్యాచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరకంగా ఎంతో దోహదపడతాయని తెలిపారు. అనంతరం విన్నర్ గా నిలిచిన రౌడీ లెవెల్ కొత్తూరు, రన్నర్ గా నిలిచిన ఇల్లందు వైఎన్సిసిలకు ట్రోఫీలు, ప్రైజ్ మనీ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, మండల రాము, శివశక్తి దండు సారయ్య (సారిక), పూనెం సురేందర్, అలీ, కాకటి భార్గవ్, నిర్వహకులు బొల్లి రాజు, నవీన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ టేకుపల్లి మండల కమిటీ డిమాండ్




*టేకులపల్లి,మార్చి03, ప్రజాజ్యోతి :*

అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ టేకులపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తాసిల్దార్ నాగ భవానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 23,24వ తేదీన 2025 సంవత్సరం అకాల వర్షంతో చేతి కొచ్చిన మొక్కజొన్న కింద పడిపోవటం రైతులకు అపార నష్టం జరిగిందని వారు ఆరోపించారు. కల్లాలలో ఆరబోసిన మిర్చి తడిసి ముద్దయి పోవటం ఇతర పంటలు కూడా దెబ్బతిన్నాయని వాటిని అంచనా వేసి తగిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. మొక్కజొన్న కింటాకు 30 వేల రూపాయలు మిర్చి ఎకరాకు లక్ష రూపాయలు ఇతర పంటలకు ఎకరాకు 20వేల రూపాయలు ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు. రైతుల పంటలు తడిసిపోకుండా టార్ బాలిన్ ఉచితంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ డివిజన్ నాయకులు జరుపుల సుందర్, మండల నాయకులు ఏనుటి నాగయ్య, పంతులు, లింగ, సీతారాములు, కుక్క ముడి ప్రసాద్, గుగులోతు మదర్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాతత్పరులకు అవార్డులు

*భద్రాచలం టౌన్, మార్చి 3(ప్రజాజ్యోతి ):*



భద్రాచలం పట్టణంలో సాంస్కృతిక సేవారంగంలో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారులకు, భద్రాద్రి సేవా తత్తురులకు మార్చి 9 వ తారీకు ఆదివారం కల్పవృక్ష నరసింహ స్వామి ఆశ్రమం నందు ఒంగోలు లిటిల్ చాంప్స్ అకాడమీ వారిచే ప్రముఖుల ద్వారా అవార్డు బహుకరణ ఉంటుందని అకాడమీ అధ్యక్షులు బుచ్చేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల కూచిపూడి నృత్యాలు, తెలుగు ఉపాధ్యాయురాలు ఆకివీడు సరోజ ప్రవచనం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాట్యం అభినయించిన ప్రతి ఒక్కరికి మెమొంటో, ప్రశంస పత్రం, ప్రముఖులకు జాతీయ సేవా పురస్కారాలు అందించనున్నామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న గోళ్ళ భూపతిరావు. కల్పవృక్ష నరసింహ ఆశ్రమ ఉపాసకులు డాక్టర్ శ్రీమన్ శ్రీకృష్ణ చైతన్య కి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి : కలెక్టర్ జితేష్ వి. పాటిల్

*భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి 03, ప్రజాజ్యోతి :*




ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాస్థాయిలో పెండింగ్లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, పంచాయతీ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని అన్నారు. పంచాయతీ రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 50 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో తక్కువ సంఖ్యలో పెండింగ్ లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. అశ్వరావుపేట మున్సిపాలిటీగా రూపాంతరం చెందినందున మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి కావలసిన లాగిన్ లను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట అదనపు లాగిన్ల ద్వారా అధికారులు సమన్వయంతో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు.

# ఆన్ లైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు

**విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ**

**భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపెల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు అమలు**

**మధ్యాహ్న భోజనం పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన విద్యాశాఖ కార్యదర్శి**

**మధ్యాహ్న భోజన పథకం బిల్లుల ఆన్లైన్ చెల్లింపులకు యాప్ రూపొందించాలి**

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




*భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 03 , ప్రజాజ్యోతి :*

ఆన్ లైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ , విద్యాశాఖ సంచాలకుల నరసింహారెడ్డి తో కలిసి మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపు పై జిల్లా కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐడిఓసి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణ మాట్లాడుతూ ట్రెజరీ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు ప్రక్రియ ఆలస్యం అవుతుందని, నేరుగా ఆన్ లైన్ నుంచే మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించేందుకు గల అవకాశాలను విద్యాశాఖ పరిశీలిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ముందస్తుగా భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఆన్ లైన్ బిల్లులో చెల్లింపు ప్రారంభిస్తున్నామని ఆమె తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాలలో ముందుగా ఒక మండలాన్ని ఎంపిక చేసుకుని, నెలరోజుల పాటు ఆ మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన బిల్లులను ఆన్ లైన్ ద్వారా త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు . పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఆన్లైన్ చెల్లింపులు జరపడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో భాగంగా వివిధ రకాల రిపోర్టులు ఉంటాయని, అవి ప్రస్తుత యాప్ లో ఒకే సారి జనరేట్ అయ్యే విధంగా లేవని, నెలవారి సంగ్రహక రిపోర్టు ఆధారంగా బిల్లులు వాటికవే జనరేట్ అయ్యే విధంగా ప్రత్యేక ప్యాకేజీ మధ్యాహ్న భోజన పథకం యాప్ ను మెరుగుపరచాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం యాప్ ద్వారా రోజు వారి కచ్చితంగా హాజరు పాఠశాల స్థాయిలో ఆన్లైన్ లో ఇవ్వవలసి ఉన్నందున దానికి ఆయా పాఠశాలల ఏఎంలు యాప్ లో విద్యార్థులకు ఖచ్చితమైన హాజరు వివరాలను నమోదు చేయాలని దానిని నెలవారి రిపోర్ట్ ను ఎంఈఓ ఆన్లైన్ లో ధ్రువీకరించడం ద్వారా మధ్యాహ్నం భోజన పథకం బిల్లులు ఆన్లైన్లోనే జనరేట్ అయ్యేలా యాప్ ను రూపొందించాలని కలెక్టర్ సూచించారు. దానికి విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సంతృప్తి వ్యక్తం పరిచి యాప్ రూపొందించే దిశలో కృషి చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్, ఎఫ్ఓ శ్రీనివాసరావు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డిజే సౌండ్స్ పెడితే జైలుకే

**వివాహం, ఇతర వేడుకల్లో డిజె సౌండ్స్ పెట్టి వారిపై చట్టరీత్య కఠిన చర్యలు**

*టేకులపల్లి, మార్చి 03, ప్రజాజ్యోతి :*



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివాహం, ఇతర వేడుకల్లో డిజె సౌండ్స్ పెట్టి వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని టేకులపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ పోలీస్ తాటిపాముల సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షలు ఉండడం వలన విద్యార్థులకు డిస్టబెన్స్ అవుతుందని ఒక ఉద్దేశంతో డీజే సాంగ్స్ పరీక్షలు అయిపోయేంతవరకు ఎటువంటి అనుమతులు ఉండవని వారు తెలిపారు. వివాహ ఊరేగింపులలో, ఇతర వేడుకలలో డిజె సాంగ్స్ పెట్టి విద్యార్థులకు, వృద్ధుల కు, చిన్నపిల్లలకు, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించే డీజే సౌండ్స్ ను నడిపే ఆపరేటర్ల పై , డీజే యజమానులపై , వేడుకలను నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని డిజె సౌండ్ సిస్టంను సీజ్ చేసి వారిని రిమాండ్ పంపడం జరుగుతుందని తెలిపారు. డిజె సాంగ్స్ నిర్వాహకులు, వేడుకలు జరుపుకునే వారు పై విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఎటువంటి వేడుకలకు అయినా డిజె సాంగ్స్ పెట్టు కోకుండా విద్యార్థులకు, వృద్ధులకు, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని సీఐ తాటిపాముల సురేష్ తెలిపారు.

# విధేయుడికి చోటు దొరికేనా ?

## నిబద్ధత గల నేతకు పట్టం కట్టాలంటున్న క్యాడర్

**భద్రాచలం, మార్చి 3(ప్రజాజ్యోతి ):**

రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధేయుడికి చోటు కల్పించాలంటూ కాంగ్రెస్ క్యాడర్ బలంగా కోరుకుంటుంది . 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రత్యేక పరిస్థితుల్లో ములుగు నుంచి వచ్చి భద్రాచం భద్రాచలం అసెంబ్లీ స్థానం టికెట్ చేజిక్కించుకున్న పొదెం వీరయ్య అతి స్వల్పకాలంలోనే ఊహించని విజయం దక్కించుకున్నారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దీంతో కాంగ్రెస్ క్యాడర్ తమ అభిమాన నాయకుడు పొదెం వీరయ్య కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని పార్టీ నాయకత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు.పొదెం వీరయ్య కూడా తనకు యం యల్ సి గా అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి లతో పాటు కాంగ్రెస్ వ్యహారాల ఇంచార్జి కేసీ వేణుగోపాల్ లను కోరారు . తాజాగా రాష్ట్ర కాంగ్రెస్ ఏఐసీసీ పర్యవేక్షకురాలిగా బాధ్యతలు చేపట్టిన మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో పర్యటించిన క్రమంలో తొలి నుంచి కాంగ్రెస్ కు నమ్మినబంటుగా ఉంటున్న నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని ఆమె హామీ ఇవ్వడంతో పొదెం వీరయ్య కు ఎమ్మెల్సీ సీట్ ఇస్తారనే ఆశలు రేకెత్తుతున్నాయి. కష్టకాలంలో సైతం పార్టీని వీడకుండా పార్టీనే నమ్ముకున్న తమకు న్యాయం జరుగుతుందని పొదెం ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు అమ్ముడుపోని నేతనంటున్న పొదెం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి పార్టీలో చేర్చుకుంటున్న క్రమంలో తనకు డబ్బు ఆశచూపినా కాంగ్రెస్ పార్టీలో నిఖార్సైన నాయకుడిగా మూడు రంగుల జెండానే నమ్ముకున్నానని ఇప్పటికే పలుమార్లు పొదెం వీరయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడితో పాటు సీఎంకు లేఖలు సైతం రాసి తనకు న్యాయం చేయాలంటూ కోరారు . దీంతో ప్రభుత్వం పొదెం వీరయ్యను రాష్ట్ర ఆటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమించింది. అయితే సుమారు నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకున్న తమ నాయకుడికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి క్యాబినెట్లో స్థానం కల్పించాలని కాంగ్రెస్ కేడర్ కోరుతోంది. గతంలో అదికారపక్షం వివిధ ప్రలోభాలకు గురిచేసినా ఆయన పార్టీ వీడక పోవడాన్ని ఆ పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరయ్యకు ఎమ్మెల్యే కో టా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టికెట్ ఖాయమని కేడర్ బలంగా విశ్వసిస్తోంది. తనకు అధిష్టానం న్యాయం చేస్తుందనే ఆశాభావాన్ని పొదెం వీరయ్య వ్యక్తం చేస్తున్నారు.



# అనుమతులు లేకుండా నడిపిస్తున్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి

## ఇటుక బట్టీలలో మైనర్ లతో వెట్టిచాకిరి

## సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు

**ములకలపల్లి ,ఫిబ్రవరి 03 ,ప్రజాజ్యోతి:**

ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నడిపిస్తున్న యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి తాసిల్దార్ పుల్లారావు గారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రాజుపేట కాలనీ శివారు వాగు సమీపంలో విచ్చలవిడిగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నడిపిస్తున్నారన్నారు. ఇటుకలు తయారీ కాల్చే పొగ దుమ్ము ధూళి కారణం కాలుష్యం ఏర్పడి ప్రజలు రహదారిపై వచ్చే వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర లోని వివిధ ప్రాంతాల నుంచి మైనర్ వలస కార్మికులతో పనులు చేపించుకుంటూ వారి శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. అడవి లో కలపను అక్రమంగా నిల్వ చేసి బట్టీలకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఫారెస్ట్ అధికారులు వెంటనే స్పందించి అక్రమ కలపను స్వాధీనం చేసుకోవాలని అన్నారు. నిబంధనల కు విరుద్ధంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గద్దం వెంకటేశ్వర్లు, కీసరి వీరభద్రం, మడకం రమేష్, కొండ్రు రాజులు, రాము, పాల్గొన్నారు.



# ఘనంగా ముద్రగడ జన్మదిన వేడుకలు

**ఇల్లందు, మార్చి 3, ప్రజాజ్యోతి:**

తెలుగుదేశం పార్టీ ఇల్లందు నియోజకవర్గ నాయకుడు ముద్రగడ వంశీ జన్మదిన వేడుకలను సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముద్రణ వంశీచే ఇల్లందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ జన్మదిన కేకును కట్ చేపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ గౌడ్ మాట్లాడుతూ తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఎన్ని అడ్డంకులు, ఇబ్బందులు ఎదురైన తెలుగుదేశం పార్టీ జెండాను వదలని నాయకుడు ముద్రగడ వంశీ అని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. ముద్రగడ వంశీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో నిత్యం ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చందావత్ రమేష్ బాబు, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు దాసరి గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఏక్తా హౌజ్ సభ్యులు పాల్గొన్నారు.





# విద్యుత్తు ఉద్యోగులకు ఎటువంటి సమస్యలున్నా పరిష్కరిస్తాం



## రాష్ట్ర ఆటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య

**భద్రాచలం, మార్చి 3(ప్రజాజ్యోతి ):**

తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఉన్నా నా దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని రాష్ట్ర ఆటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. భద్రాచలంలో సోమవారం పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో ఆయనను తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల యూనియన్ (ఐఎన్ టీయుసీ అనుబంధం )నాయకులు కలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వీరయ్యకు వివరించగా విద్యుత్తు శాఖ రాష్ట్ర కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ తో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ విద్యుత్తు ఉద్యోగులు నిబద్ధతో పని చేసి సంస్థకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపిపి బక్కులుతో ముచ్చటించిన మంత్రి తుమ్మల ఎమ్మెల్యే జారే



**ములకలపల్లి, మార్చి03, ప్రజాజ్యోతి:**

మండలంలోని కమలాపురం హెడ్ రెగ్యులేటర్ పరిశీలనకు వెళుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లు మార్గ మధ్యలో సత్యంపేటగ్రామంలో ములకలపల్లి మాజీ ఎంపీపీ సడియం బక్కులు దంపతులను చూసి తన కాన్వాయ్ ను అపి వారితో కొద్దిసేపు ముచ్చటించిచారు. బక్కులు ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 80 ఏళ్ల వయసులో బక్కులు ఊరికి డ్రైన్ కావాలని అడుగుతున్నారని పక్కనే ఉన్న ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు ప్రసాద్ కి గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు కి చెప్తూ బక్కులు గొప్ప గుణాన్ని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో గ్రామానికి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుంపుల రవితేజ, ములకలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు సురభి రాజేష్ వెల్కమ్ వెంకటేష్ యువజన విభాగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాలకై ముఖాముఖీ



**ఇల్లందు, మార్చి 3, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జియం వీసం కృష్ణయ్య ఆదేశాల మేరకు సోమవారం కారుణ్య నియామకాల కొరకు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగి వారసుడికి జియం కార్యాలయంలో ఎస్ఓటూ రామస్వామి ముఖాముఖీ (ఇంటర్వ్యూ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లందు సెక్యూరిటీ డిపార్టుమెంట్ నుండి కారుణ్య నియామకాల కొరకు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగి వారసుడికి వారి కుటుంబ సభ్యులు, సాక్షుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అన్ని వివరాలు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఇంటర్వ్యూలు పూర్తి అయిన తరువాత అందరిని వైద్యపరీక్షల కొరకు పంపించి నియామక ఉత్తర్వులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిజియం (పర్సనల్ ) జివి. మోహన్ రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, సీనియర్ పర్సనల్ అధికారి కె. సాయి స్వరూప్, క్లార్క్ లు రామకృష్ణ, అపర్ణ, రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సారపాకలో వాహన తనిఖీలు



**బూర్గంపహాడ్,మార్చి 03, (ప్రజా జ్యోతి ):**

బూర్గంపహాడ్ మండలం పరిధిలోని సారపాకలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫైన్లు వెంటనే చెల్లించాలని, చలాన్లు ఎక్కువ మొత్తంలో ఉన్నట్లయితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు.మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.